

కొనసాగుతున్న పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం)లో వెబ్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. గురువారం 86,001 నుంచి 1,04,000 ర్యాంకు లోపు వచ్చిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించగా 260మంది హాజరయ్యారు. ఇందులో ఓసీ, బీసీ విద్యార్థులు 225 మంది, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 35మంది ఉన్నారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000 వరకు ర్యాంకుల విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయకర్త డాక్టర్ కె.నారాయణరావు, సీనియర్ అధ్యాపకులు డి.మురళీకృష్ణ పర్యవేక్షణలో వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే శంకర్ తదితరులు

గంజాయి రహిత జిల్లాగా
తీర్చిదిద్దుదాం

- డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి
- వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళంలో భారీ ర్యాలీ

శ్రీకాకుళం కలెక్టరేట్/ క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించి, సిక్కోలును గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'నాషా ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. నగరం అంతటా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 80 అడుగుల రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్న మాట్లాడారు. 'వైసీపీ పాలనలో రాష్ట్రంలో గంజాయిపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టారు. నేడు అది ఎక్కడ చూసినా భూతమై కనిపిస్తోంది. గంజాయి నిర్మూలనపై (మిగతా 6వ పేజీలో..)


ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన

నిర్వహణ కష్టమే

- కడుమ ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- రైతులపైనే ఎకరాకు రూ.వెయ్యి చొప్పున భారం
- శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో అందని సాగునీరు



కడుమ వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం

కొత్తూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వంశధార నదీ తీరాన కొత్తూరు మండలం కడుమ వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం నిర్వహణ రైతులకు భారమవుతోంది. అధికారులు, పాలకులు దీనిని పట్టించుకోవడం లేదంటూ రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. కడుమ, జగన్నాథపురం, హంస, బలద గ్రామాల పరిధిలో సుమారు 480 ఎకరాలకు సాగునీరు అందక పంట పొలాలు బీడువారేవి. ఈ నేపథ్యంలో రైతులకు సాగునీటి కష్టాలు తీర్చాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 మార్చిలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులు రూ.1006.18 లక్షలు మంజూరు చేశారు. వాస్తవానికి తక్కువ ఆయకట్టు ఉంటే ఎత్తిపోతల పథకం మంజూరు కాదు. ఈ నేపథ్యంలో అధికారులే లేని భూమిని 1,160 ఎకరాలు ఉన్నట్లు చూపి.. ఎకరానికి రూ.లక్ష చొప్పున ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. ఆపై టెండర్లు పిలవగా.. కాంట్రాక్టర్ నిర్ణీత గడువులోగా పనులను పూర్తిచేసి.. 2021 ఆగస్టులో అధికారులకు అప్పగించారు. కాగా, టీడీపీ ప్రభుత్వం మారి.. వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించలేదు. దీంతో నాలుగు గ్రామాల రైతులే సాహసించి ఈ పథకాన్ని ప్రారంభించారు. పొలాలకు సాగునీటిని వినియోగించారు. కాంట్రాక్టర్ రెండేళ్లపాటు నిర్వహణ చేపట్టి.. వదిలేశారు. దీంతో నిర్వహణ బాధ్యత రైతులపై పడింది. ఎకరాకు రూ.వెయ్యి చొప్పున చందాలు వేసుకుని నిర్వహణ కొనసాగిస్తున్నారు. కాగా, పెరుగుతున్న సాగు ఖర్చులు, పెట్టుబడి వ్యయం నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్వహణ భారమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వంశధార నదీ గర్భం నుంచి సాగు భూములు ఎత్తుగా ఉన్నాయి. నదిలో పంపుహౌస్ చుట్టూ ఇసుక మేట లు వేయడంతో నీటి ప్రవాహం తగ్గి శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. దీంతో ఆయా రైతులు ఎకరాకు రూ.వెయ్యి చొప్పున చెల్లించడం లేదు. ఈక్రమంలో నిర్వహణ మరింత కష్టమవుతోందని రైతులు (మిగతా 6వ పేజీలో..)


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రెవెన్యూ సమస్యలపై తక్షణమే స్పందించాలి

- పీజీఆర్ఎస్ అర్జీలు పెండింగ్‌లో ఉండరాదు
- 22ఏ భూములను తక్షణమే పరిశీలించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి గురువారం శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి తహసీల్దార్లు, హెచ్‌డీటీలు, సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు, వీఆర్‌ఓలతో ప్రతివారం సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. వీఆర్వోలు రెవెన్యూ సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పీజీఆర్ఎస్‌పై అర్జీలు పెండింగులో ఉండరాదని ఆదేశించారు. ఇందుకు సంబంధించి మండలాల వారీగా తహసీల్దార్లు, వీఆర్వోలతో సమీక్షించారు. ఈ-ఆఫీసుపై తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. రెవెన్యూ సమస్యలపై వీఆర్వోలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈహెచ్ఎస్ ఆసుపత్రి నిర్మాణానికి స్థల ప్రతిపాదనలు పంపాలని సైనిక సంక్షేమాధికారిని ఆదేశించారు. గార మండలంలో డీఆర్డీఏ, ఎచ్చెర్లలో ఆర్టీఓ, సరుబుజ్జిలి, రణస్థలం మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, శ్రీకాకుళంలో మార్క్‌ఫెడ్, పర్యాటక శాఖకు సంబంధించిన భూ సమస్యలపై చర్చించారు. 22-ఏలో భూ యజమానులకు ముందుగా నోటీసులు పంపి పరిశీలనకు వెళ్లాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించకపోతే అలాంటి వారి జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. కర్మయోగి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో కె.సాయిప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జయదేవి తదితరులు పాల్గొన్నారు.



'గ్రానైట్'పై పన్నుపోటు

- క్యూబిక్ మీటర్ విధానం నుంచి టన్నుల దిశగా సీనరీస్ చార్జీలు
- కట్టర్‌సైజ్ బ్లాక్‌కు పది నుంచి 20శాతం పెంపు
- గ్యాంగ్‌సా బ్లాక్‌కు 20 నుంచి 30శాతం అదనం

టెక్కలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నీలి రంగు గ్రానైట్ పరిశ్రమపై పన్నుపోటు పడింది. ఇందుకు సంబంధించి ఏపీఎంఎంసీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్‌లో విడుదలైన జీవో 57కు సంబంధించి ఇందులో తాజా మార్గదర్శకాలు జత చేసింది. గతంలో కట్టర్ సైజ్, బిలోగ్యాంగ్‌సా, గ్యాంగ్‌సా సైజుల్లో సీనరీస్ చార్జీలు వసూలు చేసేవారు. ఈసారి కట్టర్, గ్యాంగ్‌సా సైజులకే పన్నుల వసూళ్లు పరిమితం చేశారు. క్యూబిక్ మీటర్లలో కాకుండా టన్నేజ్‌ల రూపంలో సీనరీస్ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. కట్టర్‌సైజ్‌కు పది నుంచి 20శాతం, గ్యాంగ్‌సా సైజులకు 20శాతం నుంచి 30శాతం పన్నులు పెంచారు. దీంతో నీలిరంగు గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆందోళన (మిగతా 6వ పేజీలో..)



నేడు జగన్నాథుని
రథయాత్ర
- 5న మారు యాత్ర
- ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన మందిరాలు

6లో

జ్యేష్ఠ భాగం ఇవ్వకపోవడంతోనే..
- కామధేనువులో తమ్ముడి హత్య
- నిందితుడి అరెస్టు

8లో

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి
- గోలుగువానిపేటలో విషాదం

నిర్మించారు.. నిర్వహణ మరిచారు
- వినియోగంలోకి రాని వెన్నెలవలస వద్ద గోదాము

8లో

సైనిక్ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు

శ్రీకాకుళం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో సైనిక్ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. యాభై శాతం రాష్ట్ర వాటా కింద సైనిక్ భవన్ నిర్మాణానికి ఆర్థిక శాఖ పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఉత్తర్వులను విడుదల చేశారు.

ఇది చెరువేనా?

- రసాయన వ్యర్థాలతో నిండిన సీతంపేట ఊరచెరువు
- బీర్ల పరిశ్రమ వ్యవహారంపై గ్రామస్థుల మండిపాటు
- కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పరిశీలన
- నీటి నమూనాల సేకరణ


బీరు పరిశ్రమ వ్యర్థాలతో కలుషితమైన సీతంపేట ఊరచెరువు

రణస్థలం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వాహకుల తీరు కారణంగా కాలుష్యంతో ఇబ్బందులు తప్పడం లేదని రణస్థలం మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెంతనే ఉన్న సీతంపేటలో ఊరచెరువు.. బీర్ల పరిశ్రమ రసాయన వ్యర్థాలతో నిండిపోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. జల, వాయు కాలుష్యం కారణంగా తామంతా అనారోగ్యం బారిన పడుతున్నామని పరిశ్రమ నిర్వాకంపై మండిపడుతున్నారు. గురువారం గ్రామస్థులు, రైతులంతా ఊర చెరువు వద్దకు చేరుకుని తమ ఆవేదన వెల్లగక్కారు. 'బంటుపల్లి పంచాయతీ పరిధిలోని యునైటెడ్ బేవరేజస్ బీర్ల పరిశ్రమ విడిచి పెడుతున్న వ్యర్థాలు సమీపంలోని సీతంపేట ఊర చెరువులో కలుస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా రసాయనాలతో కూడిన వ్యర్థాలు విడిచిపెట్టడంతో.. 40 ఎకరాల ఆయకట్టు కలిగిన చెరువు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. చెరువులో మత్స్యసంపద పూర్తిగా కనుమరుగైంది. ఆపై రసాయనాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వస్తోంది. సీతంపేటతోపాటు నగరప్పాలేం, బండిపాలేం పరిసర గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలు, మూగజీవాలు ఈ చెరువులో దాహార్తిని తీర్చుకునేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జల కాలుష్యం కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నాం. ఇదేమని ప్రశ్నిస్తే పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. స్థానికులకు ఉపాధి కల్పించకపోగా.. ఇబ్బందులకు గురి చేస్తున్నార'ని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా గురువారం సీతంపేటలో ఊర చెరువును పరిశీలించారు. చెరువులో నీటి నమూనాలు సేకరించారు. నీటి నమూనాలను (మిగతా 6వ పేజీలో..)


ఆవేదన చెందుతున్న సీతంపేట గ్రామస్థులు, రైతులు



ఉద్దానం పనస..
రుచే వేరు
- కొబ్బరి తోటల్లో అంతరపంటగా సాగు
- కూరల్లోనూ వినియోగం

6లో

ఉద్దానం పనస.. రుచే వేరు



కాయలతో ఉన్న పనస చెట్టు

కవిటి ప్రాంతంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పనసకాయలు



ఖర్జూరం పనస తొనలు

- కొబ్బరి తోటల్లో అంతరపంటగా సాగు
- కూరల్లోనూ వినియోగం

కవిటి, జూన్ 26(ఆంధ్రజ్యోతి)

ఉద్దానం పేరు చెబితే గుర్తుకు వచ్చే ప్రధాన పంటల్లో పనస ఒకటి. వేసవి కాలంలో ఉద్దానంలోని ఏ గ్రామంలో చూసినా పనస కాయలు, పండ్లు కనిపిస్తుంటాయి. ఈ ప్రాంత పనస పండు రుచికి పెట్టింది పేరు. జనవరి నుంచి జూలై వరకు ఇది లభ్యమవుతుంది. ఎలాంటి రసాయనాలు వినియోగించని పంట ఇది. ఇందులో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ ఖర్జూరం, తేనె ఖర్జూరం, కర్పూరం, బురద, అక్కడక్కడ నిత్యపనసను రైతులు సాగు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో ఈ పంట విరివిగా లభిస్తుంది. అధిక శాతం రైతులు కొబ్బరి తోటల్లో అంతర పంటగానే దీనిని సాగుచేస్తున్నారు. దాదాపు వెయ్యి ఎకరాల వరకు ఈ పంట సాగు చేస్తున్నారు. కొంతమంది ఇళ్ల ఆవరణల్లోనూ దీనిని పెంచుతుంటారు. ఈ పంటలో ఖర్జూరానికి ఉన్న డిమాండు ఎక్కువ. ఇది తియ్యగా ఉండి.. పీచుపదార్థాన్ని కలిగి ఉంటుంది. పిందెల నుంచి వీటి ధర, మార్కెట్ ప్రత్యేకంగానే ఉంటుంది. పనస పండు ధరలైతే రూ. వంద నుంచి 500 వరకు పలుకుతాయి. తేనే ఖర్జూరం అనే రకం మరింత ధర పలుకుతుంది. గత మూడేళ్లుగా సరిగా వర్షాలు లేక ఉద్దానం ప్రాంతంలో పనస పంట అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది కొంతమేర దిగుబడి కనిపిస్తున్నా ఎగుమతులు లేవు. ఒడిశా వ్యాపారులు కొనుగోలుకు వచ్చేవారు. కానీ ఈ ఏడాది వారుసైతం ముఖం చాటేశారు.

కూరగా వినియోగం..

కాయల దశలో కొన్న వ్యాపారులు కటక్. కోల్‌కత్తా, ఖరగ్‌పూర్, భిలాయ్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. ఈ కాయలపై నున్న తొక్కను తొలగించి.. లోపలి భాగాన్ని చిన్న ముక్కలు, పొడర్‌లా చేసి కూరల్లో వినియోగిస్తారు. వీటిని నిల్వచేసి పనసపొట్టు కూరలను తయారుచేస్తారు. ఒడిశాలోని బరంపురం, భువనేశ్వర్ ప్రాంతాల్లో పనస పొట్టుతో ఊరగాయను తయారుచేసి అమ్మకాలు చేస్తున్నారు. ఉద్దానం ప్రాంతంలో జరిగే శుభకార్యక్రమాల్లో పనసపొట్టుతో బిర్యానీని తయారు చేస్తున్నారు. పండులోని తొనలు తినగా అందులో ఉండే పిక్కలు (విత్తనాలు)ను కాల్చుకొని తినటం, కూరలు తయారు చేయటం గ్రామీణ ప్రాంతాల్లో అలవాటు.

కాయల అమ్మకానికే మొగ్గు..

ఇందులో బురద, కర్పూరం వంటి రకాలను రైతులు పిందె, కాయ దశల్లోనే విక్రయిస్తుంటారు. పిందె దశలో రైతులు దళారులకు చెట్లలో కాపు ఆధారంగా అమ్మకాలు సాగిస్తారు. వారు కాయలను తీసి కంచిలి, హరిపురం ప్రాంతాలకు తీసుకువెళ్లి వ్యాపారులకు కేజీల చొప్పున అమ్మకాలు సాగిస్తారు. ఉగాది వరకు ఈ తంతు కొనసాగుతుంది. ఆ తర్వాత వ్యాపారులు కొనుగోలు చేయటానికి ఆసక్తి చూపరు. దానితో చెట్లలో కాయలు పక్వానికి వచ్చే వరకు ఎదురుచూస్తారు. మే, జూన్ నెలలు వచ్చాయంటే జిల్లాలోని వివిధ మార్కెట్లలో ఇవి కనిపిస్తాయి.

ఆరోగ్యానికి మేలు..

పనస పండిన తర్వాత ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. తక్కువ ఉష్ణోగ్రతల వద్ద నిల్వ ఉంచితే కొన్నిరోజుల వరకు ఇబ్బంది ఉండదు. పనస పండులో పోషకాలు పుష్కలంగా ఉండటమే కాకుండా మాంసానికి ప్రత్యామ్నాయంగా తినవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇందులో విటమిన్-ఎ,సి, యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. గుండె సమస్యలను నివారించటమే కాక జీర్ణవ్యవస్థను మెరుగుపర్చి, మలబద్ధకాన్ని నివారిస్తుందని చెబుతారు.

నేడు జగన్నాథ రథయాత్ర

- ఏర్పాట్లు పూర్తి

ఇచ్ఛాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్నాథుడు రథంపై జనం మధ్యకు రానున్నాడు. పూరీ శ్రీక్షేత్రం తరహాలోనే ఇచ్ఛాపురంలోనూ శుక్రవారం అంగరంగ వైభవంగ రథయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నిత్యారాధన, మహానైవేద్యం అనంతరం భోగ మండపం నుంచి ముఖ మండపంలోనికి స్వామివారిని తీసుకువస్తారు. అక్కడే రక్షాబంధనం చేసి రథయాత్రకు సిద్ధం చేస్తారు. మధ్యాహ్నం విశేష పూజ, పుణ్యావచనం, రథ సంప్రోక్షణ, హారతి అనంతరం సుదర్శన, బలభద్ర, సుభద్ర మూర్తులను రథంపై ఆవాహన చేస్తారు. చివరగా జగన్నాథ స్వామి వారు రథంపైకి చేరుకున్న తరువాత వస్త్రాలంకరణ అనంతరం కుంభదృష్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రజా ప్రతినిధులు, భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

విస్తృత ఏర్పాట్లు..

శ్రీకాకుళం జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాదరావు పట్నాయక్ ఆధ్వర్యంలో సోంపేట దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ కె.వెంకటరమణ, ఆలయ మేనేజర్ బెండి రామారావు ఆధ్వర్యంలో రథయాత్రకు ఏర్పాట్లు చేశారు. జగన్నాథ సేవా దళం సభ్యులు సహకారం అందిస్తున్నారు. రెండు ఆలయాల నడుమ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం కలిగినా ఇబ్బంది లేకుండా జనరేటర్లు అమర్చారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ మీసాల చిన్నంనాయిడు, పట్టణ ఎస్ఐ ముకుందరావు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయి. యాత్రలో ఐదోరోజు హీరా పంచమి పర్వదినం జూలై ఒకటో తేదీన జరుగుతుంది. జూలై 5న మారు రథయాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి.



రథయాత్రకు ముస్తాబైన జగన్నాథ మందిరం



పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

నరసన్నపేటలో..

నరసన్నపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని పెద్దపేటలో నిర్వహించనున్న జగన్నాథస్వామి రథయాత్రకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం సత్యవరం నుంచి సుబద్ర, బలభద్రునితో జగన్నాథుని రథం మీద గుడించా మందిరానికి తీసుకురానున్నారు. ఏకాదశి వరకు గుడించాలో పదిరోజులు పాటు రోజుకో అవతారంలో స్వామి దర్శనమిస్తారు. అలాగే వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు తెలిపారు.

సోంపేటలో..

సోంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా బారువలోని స్వామి వారి ఆలయంలో గురువారం నేత్రోత్సవం నిర్వహించారు. నవయవ్వన రూపంలో భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. అనంతరం మొదటి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

క్వాంటమ్ కోర్సులపై ఉన్నత స్థాయి సమీక్ష

ఎచ్చెర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో అమలు చేయనున్న క్వాంటమ్ సంబంధిత కోర్సులపై గురువారం ఉన్నత విద్యాశాఖ వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీలతో సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పాల్గొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది డిగ్రీ స్థాయిలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సుల అమల్లో భాగంగా సిలబస్ రూపకల్పనకు నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. క్వాంటమ్ కోర్సులపై అధ్యాపకులకు శిక్షణ, అకడమిక్ క్యాలెండర్ రూపకల్పన, విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లపై వర్సిటీలు సన్నద్ధం కావాలన్నారు. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ వివిధ వర్సిటీల్లో క్వాంటమ్ ల్యాబ్‌లు, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఈటీఈసీ కార్యదర్శి కాటం భాస్కర్, సీఎం కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న, బీఆర్ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలు సాగు చేయాలి

- రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచేందుకు చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతుకు పది గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు అందించి ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచే విధంగా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమ, మత్స్యకారశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం తీసుకువచ్చే ఉద్యానవన పంటలు సాగు చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కోటబొమ్మాళిలో గొర్రెలకు, మేకలకు ఉచిత సామూహిక నట్టల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభించామని, ఏడాదికి నాలుగు సార్లు రాష్ట్రంలోని ఉన్న 1.76 కోట్ల గొర్రెలు, 55లక్షల మేకలకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని, తమ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని మళ్లీ అమలు చేస్తోందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఆవులు, గేదెలు మృతి చెందితే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రూ.103 కోట్లు మంజూరు చేసి ఆ పాడిరైతులకు ఆదుకున్నామన్నారు. జూలై మొదటి వారంలో కేంద్రప్రభుత్వం ఇచ్చే రెండువేలతో కలిసి మొత్తం రూ.ఏడు వేలు రైతుల ఖాతాలో జమచేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారంలో మరో రెండు విడతల్లో మొత్తం రూ. 20వేలు జమ చేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక సంయుక్త సంచాలకులు కంచరాన రాజగోపాల్, టెక్కలి ఉప సంచాలకులు పాతనపల్లి చంద్రశేఖరరావు, గొర్రెలు, మేకల సహకార సంఘం అధ్యక్షులు కుజ్జు తాతయ్య, స్థానిక సహాయ సంచాలకులు ఎం.లోకనాధం, పీఏసీఎస్‌మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

ఇది చెరువేనా?

(ఐదో పేజీ తరువాయి)

ల్యాబ్‌కు పంపించి.. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని కాలుష్య నియంత్రణ మండలి ఏఈ హరీష్ తెలిపారు.

భరించలేని దుర్వాసన..



ఏడాది పొడవునా నీటితో ఈ చెరువు కళకళలాడేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కనీసం పశువులు తాగేందుకు కూడా నీరు లేని దుస్థితి. రసాయన వ్యర్థాలు తేలి భరించ లేని దుర్వాసన వస్తోంది. సంబంధించి యాజ మాన్య ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టిం చుకోలేదు. అధికారులే చర్యలకు ఉపక్ర మించాలి.

-పడాల రవిబాబు, సీతంపేట

నీరు పాడైంది..



చెరువులో వ్యర్థాలు విడిచి పెడుతుండడంతో పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. పూర్తిగా నీరు పాడైంది. రసాయన వ్యర్థాలు తేలి పోయి దుర్గంధం వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-పడాల రామారావు, సీతంపేట

చర్యలు తీసుకుంటాం..

పరిశ్రమల వ్యర్థాలను ఆరుబయట విడిచి పెట్టరాదు. చెరువులు, వాగుల్లోకి వ్యర్థాలను విడిచిపెట్టడం నేరం. వ్యర్థజలాలను పరిశ్రమల్లోనే శుద్ధి చేయాలి. చెరువులను కలుషితం చేసే పరిశ్రమలపై చర్యలు తీసుకుంటాం.

-హరీష్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ, శ్రీకాకుళం

నిర్వహణ కష్టమే

(ఐదో పేజీ తరువాయి)

వాపోతున్నారు. నాలుగు గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేలా మరో నాలుగు పాయింట్‌లు నిర్మించాలని నీటిపారుదలశాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కడుము గ్రామానికి చెందిన వలురౌతు ధర్మారావు, బూరాడ గోవిందరావు, మంతాన అప్పారావు తదితర రైతులు కోరుతున్నారు. ఎత్తిపోతల పథకం నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పథకం నిర్వహణకుగానూ టెక్నీషియన్‌ను, సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

- ఈ విషయమై నీటిపారుదలశాఖ ఈఈ సుబ్రహ్మణ్యం వద్ద ప్రస్తావించగా 'కడుము ఎత్తిపోతల పథకాన్ని రైతులే ప్రారంభించారని తెలిసింది. ప్రస్తుతం రైతులకు సాగునీరు అందుతోంది. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి చర్యలు చేపడతామ'ని తెలిపారు.

'గ్రానైట్'పై పన్నుపోటు

(ఐదో పేజీ తరువాయి)

చెందుతున్నారు. గతంలో కట్టర్‌సైజ్ బ్లాకులకుగాను అన్నిరకాల పన్నులు కలిపి క్యూబిక్ మీటర్‌కు రూ.4,500 ఉండగా, ఈసారి రూ.4,900 నుంచి రూ.5,250కు పెంచారు. గ్యాంగ్‌సా సైజుకు గతంలో రూ. 4,790 ఉండగా.. ప్రస్తుతం రూ.5,800 నుంచి రూ.6,200 వరకు పన్నుల భారం పెంచారు. ఇక డెడ్‌రెంట్లు విషయానికి వస్తే ఒక హెక్టారుకు గతంలో రూ.1.30 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.1.50లక్షలకు పెంచేశారు. గనుల శాఖ ఒక క్యూబిక్ మీటర్‌కు 2.75 టన్నుల కింద లెక్కలు వేసుకోగా, బ్లూ గ్రానైట్ వైర్‌సా కటింగ్ జరిగినా మూడు టన్నులకు తగ్గడం లేదు. వీటిపై శాస్త్రీయ సర్వే జరగకుండానే పన్నులు పెంచేశారని గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆరోపిస్తున్నారు. వైసీపీ హయాంలో పెంచిన కన్సడరైజేషన్ ఫీజులను కూటమి ప్రభుత్వం తొలగించినట్లే తొలగించి.. టన్నుల రూపంలో సీనరీస్ చార్జీలు పెంచేసిందని పేర్కొంటున్నారు. నీలిరంగు గ్రానైట్ పరిశ్రమకు పన్నుపోటు గుదిబండగా మారిందని నిట్టూర్చుతున్నారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

(ఐదో పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో ప్రత్యేక ప్రచారాలు నిర్వహించాం. 4వేల మంది పోలీసులతో ఈగల్ టీమ్‌లను ఏర్పాటుచేసి, డ్రగ్స్ వినియోగం, రావాణాపై ఉక్కుపాదం మోపాం. టెక్నాలజీని కూడా వినియోగించి ఏజెన్సీలో గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించాం. యువత డ్రగ్స్ బారిన పడి విలువైన జీవితాలను కోల్పోతున్నారు. గంజాయి మత్తులో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్ వినియోగాన్ని తొలిదశలోనే నిర్మూలిద్దాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి' అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అందరితో మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞను చేయించారు.

యువతా ఆలోచించండి..

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 'సరదా కోసమో, కష్టం ఎదురైనా, స్నేహితుల ప్రోద్భలంతో కొంతమంది యువత డ్రగ్స్ బారిన పడి భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారు. యువతా ఆలోచించండి. డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఎవరైనా మీ స్నేహితులు ఇందులో కూరుకుపోతే వెంటనే పోలీసులకు తెలియజేయండి. బాధ్యత గల పౌరులుగా జీవితంలో గొప్పగా ఎదగండి' అని పేర్కొన్నారు.

జీవితాలను బాగుచేయడమే లక్ష్యంగా..

ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. 'యువత జీవితాలను బాగుచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఈగల్ టీమ్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఏడాదిలో 160 కేసులు నమోదు చేశాం. 1930 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. 270 మందిపై కేసులు నమోదు చేశాం. హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. డ్రోన్లను వినియోగించి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సహాయంతో ఈగల్ టీమ్స్ ద్వారా నిందితులను పట్టుకున్నాం. 52 మందిని డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి బాగుచేయగలిగాం. డ్రగ్స్ వినియోగంలో పట్టుబడితే కఠినచర్యలు తప్పవు' అని హెచ్చరించారు.



డ్రగ్స్ నిర్మూలనపై శ్రీకాకుళంలో భారీ ర్యాలీ..



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు





అవగాహన కల్పించే ప్లకార్డులతో ర్యాలీ

మత్తు.. జీవితకాలం చిత్తు

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'ఒక్క క్షణం మత్తుకు అలవాటైతే అది మీ జీవితకాలాన్ని చిత్తు చేస్తుంది. యువత జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యంగా ముందుకెళ్లాలి. మత్తుకు బానిసలై కుటుంబానికి, సమాజానికీ భారం కావద్ద'ని హితవు పలికారు. అలాగే డ్రగ్స్ నివారణపై యువతను చైతన్య పరిచేలా తప్పెటగుళ్ల కళాకరుల ప్రదర్శన ఆటకట్టుకుంది. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి, టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఆర్డీవో సాయిప్రత్యూష, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ తిరుపతినాయుడు, సీఐ గోపాలకృష్ణ, శీర రమణయ్య, చౌదరి అవినాష్, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, ఎస్వీ రమణమాదిగ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో బాధితులకు భరోసా

పొందూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి మంజూరవుతున్న నిధులు బాధితులకు భరోసా నిస్తున్నాయని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల, మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ అన్నారు. ఇటీవల ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన పుల్లాజీపేట (రెడ్డిపేట) గ్రామానికి చెందిన రెడ్డి అచ్చెన్నాయుడుకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.5.04 లక్షల చెక్కును గురువారం అందించారు. రాష్ట్రంలో ఆమదాలవలస నియోజకవర్గంలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద ఎక్కువ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, దళ్లి రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూర్జలో...

బూర్జ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మదనాపురం గ్రామానికి చెందిన రాజేంద్ర ఇటీవల మృతిచెందారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన రూ.4.14లక్షల చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల బాధిత కుటుంబానికి గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, అప్పలపేట సర్పంచ్ కొరికాన రాజు, వావిలపల్లి ఆదినారాయణ, మజ్జి అప్పలనాయుడు, దూబ బాలకృష్ణ, దాసిరెడ్డి మౌళి, దేవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరంతో ఐక్యత

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):స్వాతంత్రోద్యమంలో వందేమాతర గీతం భారతీయులలో ఐక్యతాభావాన్ని, స్ఫూర్తిని రగిలించిందని వక్తలు పేర్కొన్నారు. స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో వందేమాతరం రచయిత బంకించంద్ర చటోపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. బంకించంద్ర విగ్రహదాత డాక్టర్ నిక్కు అప్పన్నతో పాటు గాంధీ మందిర ప్రతినిధులు, వివిధ రంగాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, డాక్టర్ మందుల మోహన్‌రావు, భీమశంకర్, పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి, నటుకుల మోహన్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కమిషనర్ అభినందన

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టి.పి.ఎం. హైస్కూలు క్రీడాకారులు 2024-25 ఏడాదికిగాను మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి పలు పతకాలు కైవశం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావును క్రీడాకారులు కలిశారు. వీరిని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.సాంబమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు ఇందిరామణి, పీఈటీ ఎల్.దిలీప్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.తిరుమలరావు కోరారు. నువాగడ పంచాయితీ పరిధిలోని 12 గిరిజన గ్రామాల ప్రజలతో మండల స్థాయి అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్తీజన భగీరథి అభియాన్ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. గిరిజనులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదించాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ప్రత్యేకాధికారి ఇబ్రహీం, ఎక్సైజ్ ఎస్ఐ గురుమూర్తి, ఏవో కొంక్యాన సురేష్, వైద్యాధికారి తమ్మినేని హరిబాబు, మండల పశువైద్యాధికారిణి టి.శిరీష, ఎంఈవో చిట్టిబాబు, జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, సర్పంచ్ సబితా గొమాంగో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఆమదాలవలస, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఈవోపీఆర్‌డీ గోపాలరావు అన్నారు. గురువారం కొర్లకోట గ్రామంలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాల అమలు తీరుపై గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశు భ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ కో-ఆర్డినేటర్ చల్ల కామేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి హరీష్, గ్రీన్‌గార్డ్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రణస్థలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రణస్థలం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ గరికిపాలెం, గొల్లపేట, పిస్నింటిపేట, దన్నానపేట, జేఆర్‌పురం, భావరాజపాలెం, రణస్థలం, కమ్మసిగడాం, అర్జునవలస, సంచాం, ఎం.నగరప్పాలాం, నడుకుదిటిపాలెం, తిరుపతిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొందూరులో...

పొందూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): లోలుగు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. లైనుకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నందివాడ, బురిడి కంచరాం, నరసాపురం, అన్నంపేట, కేశవదాసుపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం నిజామాబాద్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని అన్నారు. గార మండలంలో శివారు భూములకు కూడా ఈ ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.త్రినాథస్వామి, ఏవో దుంపల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

శ్రీకాకుళం రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సింగుపురం పంచాయతీలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం రోటరీ క్లబ్ శ్రీకాకుళం బృందం సభ్యులు విద్యార్థులకు సుమారు రూ.ఆరు లక్షల విలువైన పరుపులను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత, సమగ్ర శిక్ష పీవో శశిభూషణ్, రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు ముని శ్రీనివాస్, సెక్రటరీ దూసి సంతోష్, కోశాధికారి సూర్య పసగాడ, సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అద్భుత విజయం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే అద్భుత విజయం సాధించగలిగామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, ఆయుష్ టీమ్‌లను ఆయన అభినందించారు. శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లిలోని సంప్రదాయ గురుకులంలో 'యోగాంధ్ర' విజయోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ కార్యక్రమాన్ని నిర్వహించ గలిగామని.. కీలకపాత్ర పోషించిన అన్ని విభాగాల అధికారులు, ప్రజా ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో వెంకటేశ్వరరావు, ఆర్డీఓ సాయిప్రత్యూష, ఆయుష్ జిల్లా అధికారి డా. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

పొందూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత అధ్యాపకులు, సిబ్బందిపైనే ఉందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) సురేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. కళాశాలలో తరగతి గదులు తక్కువగా ఉన్నాయని ప్రిన్సిపాల్ ఇందిర డీవీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. మౌలిక సదుపాయాల కొరత కళాశాలలో అడ్మిషన్లపై ప్రభావం చూపుతోందని అన్నారు. దీనిపై డీవీఈఓ స్పందిస్తూ తరగతి గదుల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు.

పాలిథిన్‌తో ముప్పు

పొందూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని ఎస్ఐ వి. సత్యనారాయణ అన్నారు. ఆడపిల్ల సేవా సొసైటీ వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు ఎం. లావణ్య, ఈవో మోహన్‌బాబు పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే

కవిటి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న వారికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. కవిటిలో గురువారం కేఆర్‌కే రోడ్డు నుంచి వై.రామయ్యతోట వరకు రోడ్డు పనులను ప్రారంభించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి వలసలను నివారించాలనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మోహనరావు, జనసేన నేత ఎల్.రాజేష్, టీడీపీ నేతలు బి.రమేష్, ఎ.మధు, వి.రంగారావు, ఎ.త్రివిక్రమరావు, బి.సురేష్, పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' అందక ఇబ్బందులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజని

రణస్థలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి తల్లికి వందనం పథకం అందక ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో సమావేశపు మందిరంలో ఎంపీపీ పిన్నింటి రజనిసాయి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. రాయితీపై వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో భాస్కరరావు తెలిపారు. 50 శాతం రాయితీ పై మత్స్యకారులకు వలలు, బోట్లు అందుబాటులో ఉన్నాయని ఎఫ్‌డీవో గంగాధర్ తెలిపారు. మండలంలో లోవోల్టేజి సమస్య తీవ్రంగా ఉందని జడ్పీటీసీ టొంపల సీతారాముడు ఏఈకి తెలియజేశారు. సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ లలిత తెలిపారు. గుండెపోటుకు సంబంధించిన రూ.40 వేల విలువైన ఇంజక్షన్లు సీహెచ్‌సీలో ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయి, వైస్ ఎంపీపీ భుజంగరావు, ఎంపీడీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో సమగ్ర వికాసం

శ్రీకాకుళం స్పోర్ట్స్/ రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే విద్యార్థుల్లో సమగ్ర వికాసం సాధ్యమని అంబేడ్కర్ వర్సిటీ పూర్వరిజిస్ట్రార్ డా. గుంట తులసీరావు అన్నారు. శ్రీకాకుళంలోని కేంద్రీయ విద్యాలయంలో అండర్-14 బాలుర క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా.బి. లవ్‌కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు స్టవ్‌ల పంపిణీ

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో గల మూడు అంగన్‌వాడీ ప్రాజెక్టులకు 326 ఇండక్షన్ స్టవ్‌లు, వంటపాత్రలను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం పంపిణీ చేశారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మడ్డువలసలో పూడికతీత పూర్తి

జి.సిగడాం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పెంట గ్రామపరిధిలో మడ్డువలస కుడి ప్రధాన కాలువ పూడికతీత పనులు గురువారం పూర్తయ్యాయి. పెంట గ్రామం నుంచి మెట్టవలస బ్రిడ్జి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కాలువలో తీసిన పూడికతీత పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నీటి యాజమాన్య సంఘ అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, డిప్యూటీ డీఈ ఈశ్వరప్రసాద్, ఏఈఈలు రాజశేఖర్, నాగేంద్ర పాల్గొన్నారు.







వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


బలగలో పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బలగలో నాగావళి నది తీరాన ఉన్న శ్రీ బాలత్రిపుర కాల భైరవ పీఠంలో వారాహిదేవి నవరాత్రులు, గుప్త నవరాత్రి పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. పీఠం వ్యవస్థాపకులు గణేష్ గురూజీ మాట్లాడుతూ వారాహి దేవి పూజల విశిష్టతను తెలిపారు. కత్తెర వీధిలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అర్చకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ ఆధ్వర్యంలో వారాహి దేవికి ప్రత్యేక అలంకరణ చేశారు. మొండేటి వారి వీధిలో ఉన్న శ్రీ లక్ష్మీగణపతి, షిరిడి సాయి ఆలయంలో వారాహి దేవికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి జగన్నాథ స్వామి రథోత్సవాలు

నగరంలోని ఇల్లీసిపురం, గుజరాతీపేట, మొండేటి వారి వీధి, పాండురంగ వారి వీధిలో శుక్రవారం నుంచి జగన్నాథస్వామి రథోత్సవాలు నిర్వహించనున్నారు. బొందిలీపురం జగన్నాథస్వామి ఆలయం నుంచి ఇలిసిపురం గుండిచా మందిరానికి స్వామిని రథంపై తీసుకొస్తారు. శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు వివిధ అవతారాలలో స్వామి వారు దర్శనమిస్తారు.





నిర్మించారు.. నిర్వహణ మరిచారు

● వినియోగంలోకి రాని వెన్నెలవలస వద్ద గోదాము



వినియోగంలో లేని పౌరసరఫరాల గిడ్డంగి

సరుబుజ్జిలి,జూన్ 26(ఆంధ్రజ్యోతి):వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో నిర్మించిన పౌరసరఫరాల గోదాము నిర్వహణలోకి తీసుకురాలేదు. పనులు పూర్తయినా వినియోగంలోకి రాకపోవడంతో పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. నేటికీ సరుబుజ్జిలిలోని మార్కెట్ కమిటీకు చెందిన శిథిలావస్థకు చేరిన గోదాములోనే సరుకులు నిల్వచేస్తున్నారు.

సరుబుజ్జిలి, బూర్జ, ఎల్ఎన్‌పేట, హిరమండలం మండలాల ప్రభుత్వ చౌక దుకాణాలకు సరుబుజ్జిలి పౌర సరఫరాల గిడ్డంగుల నుంచి ప్రతినెలా నిత్యావసర సరుకులు అందించాల్సి ఉంది. అయితే అప్పట్లో నిత్యావసర సరుకుల నిల్వలకు పౌర సరఫరాల గోదాము లేకపోవడంతో సరుబుజ్జిలికి సమీపంలో ఉన్న ఆమదాలవలస మార్కెట్ కమిటీకు చెందిన గోదామును అద్దెకు తీసుకున్నారు. ఆ గోదాము శిథిలావస్థలో ఉండడంతో వర్షం కురిస్తే కారిపోతుండడంతో నిత్యావసర సరుకులు తడిచిపోతున్నాయి. ఈనేపథ్యంలో వెన్నెలవలస జవహర్ నవోదయవిద్యాలయం సమీపంలో పౌరసరఫరాల గోదాము నిర్మాణానికి 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ప్రభుత్వ విప్ కూనరవికుమార్ నిధులు మంజూరుకు కృషిచేశారు. దీంతో 50 టన్నుల వేమిషన్ కూడా ఏర్పాటుచేశారు.లక్షలరూపాయల ప్రభుత్వ నిధులతో గోదాము నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.దీంతో ప్రస్తుతం గోదాముపరిసరాల్లో రెల్లిగడ్డి, ముళ్లపొదలుపెరిగాయి. గోదాము వేమిషన్ కార్యాలయ భవనం వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాము, వే మిషన్ కార్యా లయ భవనం వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

జ్యేష్ఠ భాగం ఇవ్వకపోవడంతోనే..

● కామధేనువులో తమ్ముడి హత్య ● నిందితుడి అరెస్టు

నందిగాం, జూన్26(ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠ భాగం అడుగుతున్నా ఇవ్వకుండా వాటాలు వేయడాన్ని జీర్ణించుకోలేకపోవడంతో తమ్ముడిని అన్నయ్య హత్యకు పాల్పడాడు. ఈమేరకు నిందితుడిని పోలీసులు అరెస్టుచేశారు. నందిగాం మండలంలోని బోరుభద్రపంచాయతీ కామదేనువులో ఇటీవలజరిగిన హత్య కేసును పోలీసులు చేధించారు. గురువారం నందిగాం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ,సిబ్బందితో కలిసి టెక్కలిరూరల్ సీఐ కె.శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. కిల్లి లక్ష్మునాయుడు, ముత్యాలమ్మ దంపతులకు తవిటినాయుడుతోపాటు మరో ఇద్దరు కుమారులు ధర్మారావు, నీలకంఠం ఉన్నారు. తవిటినాయుడు తల్లిదండ్రులతో కలిసి ఉండగా.. మిగిలిన ఇద్దరికీ వివాహాలై వేరుగా కాపురం ఉంటున్నారు. కాగా ఆస్తుల పంపకంలో భాగంగా అన్నదమ్ములు తవిటినాయుడు, ధర్మారావు మధ్య తరచూ భూ వివాదం జరుగుతోంది. దీనిలో భాగంగా ఆదివారం పొలం పనులు చేస్తున్న అన్న ధర్మారావు, తవిటినాయుడు మధ్య ఘర్షణ జరిగింది.ఇంతలో పథకం ప్రకారం ధర్మారావు తమ్ముడ్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రెండో తమ్ముడు నీలకంఠం భార్య రాములమ్మ విత్తనాలు వేస్తున్న మడిలో తగాదాకు ధర్మారావు దిగాడు.చిన్నతమ్ముడు తవిటినాయుడు దీనంతటికీ కారణమని, ఆయన్ను చంపేస్తే ఏగొడవ ఉండదని నిర్ణయించుకొని రాములమ్మతో గొడవపడ్డాడు.దీంతోరాములమ్మ తవిటినాయుడుకు ఫోన్‌చేయడంతో అక్కడకు వచ్చాడు.ఆసమయంలో తన చేతిలోఉన్న పారతో తవిటినాయుడు తలపైకొట్టాడు. కిందపడిన తరువాత పలుమార్లు తలపై కొట్టి చంపేసినట్లు ధర్మారావు అంగీకరించాడు. ఈమేరకుగురువారం నర్సిపురం జంక్షన్ వద్ద తచ్చాడుతున్న ధర్మారావును అరెస్టుచేసి పలాస కోర్టులో హాజరుపరిచారు. ధర్మారావుకు, కుటుంబ సభ్యులకు మూడేళ్లుగా భూవివాదం సాగుతోంది.

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి

సంతబొమ్మాళి, జూన్ 26(ఆంధ్రజ్యోతి):మండలంలోని లక్కివలస పంచాయతీ పరిధిలోగల గోలుగువానిపేటకు చెందిన మత్స్యకారుడు గొర్లె రామారావు(39) సముద్రంలోకి వేటకు వెళ్లి మృతిచెందాడు.పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రామారావుతోపాటు మరో ఐదుగురు మత్స్యకారులు గురువారం సముద్రంలోకి వేటకు బయలుదేరారు. వేటముగించుకొని తిరిగి వస్తుండగా అలల తాకిడికి బోటుబోల్తాపడింది. దీంతో బోటులో ఉన్నా మత్స్యకారులంతా సముద్రంలో పడిపోయారు. అతికష్టం మీద నలుగురు ఒడ్డుకు చేరుకున్నారు. రామారావు ఒడ్డుకు చేరుకోకపోవడంతో మళ్లీ మరి కొంతమంది బోటులో వెళ్లి గాలించారు.ఇంతలో రామారావు మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. రామారావుకు భార్య తులసమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామారావు మృతితో కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. రామారావు కుటుంబన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ రంగరాజ్ కొరారు. ఎస్ఐ సింహాచలం పరిశీలించి కేసునమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలించారు.

రైలు ఢీకొని యువకుడు..

వజ్రపుకొత్తూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమురహరిపురానికి చెందిన గొరకల వైకుంఠరావు (33) గురువారం పూండి రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. రైల్వే ఎస్ఐ షరీఫ్, స్థానికుల కథనం మేరకు.. వైకుంఠరావు రాజమండ్రిలో కూలీపనులు చేసుకొని జీవించేవాడు. ఇటీవల పెద్దమురహరిపురం వచ్చాడు. వైకుంఠరావు తిరిగి రాజమండ్రి వెళ్లేందుకు పూండి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని రైలుఢీకొంది. దీంతో శరీరం నుజ్జునుజ్జయ్యింది. వైకుంఠరావు తండ్రి చిన్నతనంలోనే మృతిచెందాడు.ఆయన తల్లికి మతిస్థిమితం లేదు.పూండి స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

పేకాట కేసులో ఏడుగురికి జైలుశిక్ష

శ్రీకాకుళం రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): పేకాటకు సంబంధించిన కేసులో రెండో అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడుగురికి జైలు శిక్ష విధించింది. రూరల్ ఎస్ఐ కె.రాము కథనం మేరకు.. శ్రీకాకుళం రూరల్ మండలంలోని చాపురం పంచాయతీ పరిధిలో బలగ రామగెడ్డ వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిదిమందిని పోలీసులు ఈనెల 20న పట్టుకున్నారు.ఈ మేరకు వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.4060 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన అనంతరం విచారణ చేపట్టిన పోలీసులు న్యాయస్థానంలో నిందితులను హాజరుపరిచారు. ఈ మేరకు గురువారం రెండో అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఏడుగురికి 20 రోజుల పాటు జైలు శిక్ష విధించగా, ఒకరికి రూ.200 జరిమానా విధించింది.

ఎన్‌హెచ్‌పై అదుపు తప్పిన లారీ

టెక్కలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పాయిపురం సమీపంలో జాతీయరహదారిపై(ఎన్‌హెచ్) విశాఖ నుంచి పలాస వైపు బిస్కెట్ల లోడుతో వెళ్తున్న లారీ గురువారం వేకువజామున అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏకు గాయాలు

ఎచ్చెర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల వద్ద పాత జాతీయరహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో చినరావుపల్లి వీఆర్ఏ ఎచ్చెర్ల కనకయ్య గాయపడ్డాడు. ఎచ్చెర్లకు చెందిన కనకయ్య మోటారు బైక్‌తో కేశవరెడ్డి స్కూల్‌కు సమీపంలో పాత జాతీయ రహదారి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా శ్రీకాకుళం వైపు వెళ్తున్న మరో మోటారు బైక్ బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడిన వీఆర్ఏను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌పై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

ఇచ్ఛాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం చోటుచేసుకుంది. ఇచ్ఛాపురం -కొళిగాం రోడ్డులో ఉన్న మహాలక్ష్మి హార్డ్‌వేర్ దుకాణం తాళాలను దుండగులు పగులగొట్టి రూ.95 వేల నగదును అపహరించినట్లు యజమాని వాసుదేవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.ముకుందరావు తెలిపారు.

డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

లావేరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బుడుమూరు, లావేరు, సుభద్రాపురం గ్రామాల్లో డాగ్‌స్క్వాడ్‌తో గురువారం పోలీసులు తనిఖీలు చేశారు. గంజా యి వంటి మాదక ద్రవ్యాల విక్రయాలపై ఆరా తీసేందుకు ఎస్ఐ జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి, జూన్26(ఆంధ్రజ్యోతి):దళితులు కొనుగోలు చేసిన భూమి ఆక్రమణ జరుగుతున్నాయని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరారు. టెక్కలి తహసీల్దార్ కార్యాలయం వద్ద కోటబొమ్మాళి మండలం జీయన్నపేటకు చెందిన బోకర మోహనరావు, దళిత హక్కుల పోరాటసమితినాయకులు యడ్ల గోపి, దళిత సంఘాల నాయకులు ధర్నానిర్వహించారు. కార్యక్రమంలో పాపా రావు, రేఖాకుమారి పాల్గొన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పుస్తకావిష్కరణ

టెక్కలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశా లలో డాక్టర్లు కె.వేణుగోపాల్, సతీష్‌కుమార్, శ్రీరాములు రచించిన ది మోడ్రన్ గైడ్‌టు ఎంటర్‌పెన్యూర్‌షిప్, స్టార్టప్స్ పుస్తకాన్ని ఐతమ్ డైరెక్టర్ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

నరసన్నపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వరి విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తేట్రేడర్స్‌పై చర్యలు తీసుకుంటామని ఏవో సూర్యకుమారి హెచ్చరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన సన్నాలు వద్దు.. ముదుగే ముద్దు కథనంలో విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్న విషయంపై ప్రచురించడంతో అధికారులు స్పందించి గురువారం పట్టణంలో వరి విత్తనాలు విక్రయించే పలు ట్రేడర్లల్లో పరిశీలించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● జిల్లాలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యువత మత్తుజోలి పోయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఈగల్‌వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికగా ప్రత్యేక దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. వీటి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్య క్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కవిటి: ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



పాతపట్నం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



ఎచ్చెర్ల: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



నరసన్నపేట: మాదక ద్రవ్యాలు వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పోలీసు అధికారులు



పలాస: రాజీవ్ జంక్షన్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



ఆమదాలవలస:ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



టెక్కలి: మానవహారం ఏర్పాటుచేసిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే

నరసన్నపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి):ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం నరసన్నపేటలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నది చెంత ఉన్నా సాగునీటి ఏటా ఇబ్బంది పడుతున్నామని లుకలాం రైతులు విన్నవించారు. ఓపెన్‌హెడ్ చానళ్లను ఆధునికీకరించాలని రైతులు కోరారు. నాలుగు మండలాలు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ

పోలాకి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):మబగాంలో గొర్రెలకు నట్టల నివారణా మందుల పంపిణీని గురువారం ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పద్మప్రియ మాట్లాడుతూ నెలరోజుల పాటు ఉచితంగా గొర్రెలకు వ్యాధులు సోకకుండా నట్టల నివారణా మందులు వేస్తామన్నారు.

పారిశ్రామికవేత్తలకు రాయితీలు: ఏడీ

నరసన్నపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జి. రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖ ఏడీ పీవీ రఘునాథ్ తెలిపారు. గురువారం నరసన్నపేటలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ సంయుక్తంగా ఎంఎస్‌ఎంఈలపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి రాయితీలతో పాటు తక్కువ వడ్డీతో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ రుణ సదుపాయం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జామి వెంకట్రావు, ఉణ్న వెంకటేశ్వరరావు, తంగుడు జోగారావు, పట్నాన నాగేశ్వరరావు, రమణ సాహు, బోయన బాలకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● పలాస మండలం, మునిసిపాలిటీలో గల పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

పలాస, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. గురువారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ, పలాసమండలంలో గల వివిధ పెట్రోల్ బంకుల్లో ఆయిల్ నిల్వలు, అమ్మకాలతో పాటు నాణ్యతను ఆర్డీవో జి.వెంకటేష్, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, డీటీ వి.గిరి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాలకు పెట్రోల్, డీజిల్ సక్రమంగా వేస్తున్నారో లేదోనని తనిఖీచేశారు. అనంతరం మీటర్‌రీడింగ్ ద్వారా పరిమాణం కొలిచారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బంకుల్లో నాణ్యతతో పాటు కొలతలు కూడా సక్రమంగా ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పలాసలోని బంకులో పెట్రోల్ కొలతలు పరిశీలిస్తున్న వెంకటేష్

ఇంటిపన్ను శతశాతం వసూలు చేయాలి

మందస, జూన్26(ఆంధ్రజ్యోతి): ఇంటిపన్నులు శతశాతం వసూలు చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఏపీ రమణ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప ఎంపీడీవో వై.వరప్రసాద్ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

టెక్కలి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సన్మార్గాన్ని అలవరచుకొని పోటీ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యం పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల కోరారు. గురువారం టెక్కలిలోని ఓ డిగ్రీకళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సమావేశంలో బార్ అసోసియేషన్‌అధ్యక్షులు పినకానఅజయ్‌కుమార్, ఎస్ఐ రాము, జోగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

పాతపట్నం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల జోలికి వెళ్ళొద్దని, మాదక ద్రవ్యాల దుర్వినియోగం చట్టరీత్యా నేరమని పాతపట్నం జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి తెలిపారు. గురువారం పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం దినోత్సవం పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ వి.రామారావు, తహసీల్దార్ ప్రసాదరావు, ఎస్ఐ బి.లావణ్య, ప్రిన్సిపాల్ హేమసుందరరావు, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గేదెల సూర్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోషిణి

10 వరకు నట్టల నివారణ మందు పంపిణీ

పాతపట్నం, జూన్ 26(ఆంధ్రజ్యోతి):నట్టల నివారణ నిర్మూలన మందులు జూలై 10వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు మంచు కరుణాకరరావు తెలిపారు.పెద్దలోగిడిలో జరుగుతున్న డీవార్మింగ్ కార్యక్రమాన్నిపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 44,086 గొర్రెలు, మేకలకు 20పశువైద్య బృందాలు ద్వారా నట్టల నివారణ మందులు పంపిణీచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంచార పశువైద్యశాల డాక్టర్ కిరణ్, సిబ్బంది కుమారి, నిరంజన్, మోహన్, నారాయణ పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాలను ప్రకటించాలి

ఎల్.ఎన్.పేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి):జీవో-1 ప్రకారం హేతుబద్ధీకరణలో భాగంగా 4722 మంది మిగులు గ్రామసర్వేయర్లపై సమగ్ర నివేదికను ఇవ్వాలని గ్రామసర్వేయర్లు మోహనరావు, బాలకృష్ణ తదితరులు కోరారు.గురువారం ఎల్.ఎన్.పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామసర్వేయర్లు తమ సమస్యలు పరిష్క రించాలని నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్ని జిల్లాలో సీనియార్టీ జాబితాలను ప్రకటించాలని,గ్రేడ్-1 కేడర్ స్ట్రెంత్‌ను ఫైనల్ చేయాలని, అర్హత గలవారికి పదోన్నతి వచ్చేలా సర్వీస్‌రూల్స్‌లో మార్పులు చేయాలని, రీసర్వేలో పెండింగ్‌లో బిల్లులు విడుదల చేయాలని కోరారు.

శాకాంబరిగా కొత్తమ్మతల్లి

కోటబొమ్మాళి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కోట బొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఆలయానికి ఆషాడమాసం ప్రారంభంకావడంతో గురువారం భక్తులు పోటెత్తారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆషాడమాసం మొదటి గురువారం కావడంతో అమ్మవారి వివిధ రకాల కురగాయలతో శాకాంబరిగా అలంకరించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో దేవదాయశాఖ సిబ్బంది అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

వృద్ధులకు రేషన్ పంపిణీ

నరసన్నపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు రెండు రోజులుగా డీలర్లు రేషన్ సరుకులు ఇంటికి వెళ్లి పంపిణీచేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలైకు సంబంధించి జిల్లాలోని 1603 దుకాణాల్లో 94వేల కుటుంబాలకు సరుకులు పంపిణీ చేయాల్సిఉంది. ఇప్పటివరకు 36 వేల కుటుంబాలకు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.మిగతా కుటుంబాలకు ఈనెల 30 లోగా పంపిణీ చేయనున్నారు. నరసన్నపేట మండలంలో డీలర్లు సరుకులు పంపిణీ చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి

నరసన్నపేట,జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఉప్పాడ శాంతారావు హెచ్చిరించారు. గురువారం నరసన్నపేటలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

గిరిజనుల అభివృద్ధికి వన్‌దన్ కేంద్రాలు

హరిపురం, జూన్26(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీప్రాంతంలోని గిరిజనుల అబివృద్ధికి వన్‌దన్ కేంద్రాలు సహాయపడతాయని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. మందస మండలంలోని కొండలోగాంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ ఎం కూర్మారావు, సర్పంచ్ సవర రోజ, ఎంపీటీసీ సవర డిల్లేశ్వరి జ్యోత్స్న, ఏపీవో హరికృష్ణ, స్వామినాయుడు పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత

కాశీబుగ్గ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో శివారు భూములకు సాగు నీరందించేందుకు వంశధార కాలువలో పూడికలు తీసేందుకు రూ.85లక్షలు ఖర్చు చేస్తున్నామని ఆప్రాజెక్టు ఈఈ శేఖర్ చెప్పారు. గురువారం కాశీబుగ్గ ప్రాంతంలో టీడీపీ నాయకులు,నీటి సంఘం నాయకులతో కలిసి పూడికలు తీస్తున్న వంశఆర కాలువలను పరిశీలించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

వజ్రపుకొత్తూరు జూన్ 26 (ఆంధ్రజ్యోతి):పూండి గోవిదంపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రీయ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్ కేశవరావు,కర్ని రమణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంగువాడసబ్‌స్టేషన్‌లో శనివారం నిర్వహణ పనులు చేయనున్నట్లు విద్యుత్ ఈఈ జి.శంకరరావు తెలిపారు.దీంతోఆరోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గంగువాడ, తెంబూరు, వెంకటాపురం, బడ్డుమర్రి, లాబర, సింగుపురం, పెద్దలోగిడి, చిన్నలోగిడి, రట్టిపేట, పెద్దలక్ష్మీపురం, పెద్దసరియాపల్లి, మల్లిపురం, కొయ్యకొండ, బొమ్మిక, ఎస్‌జేపురం, కోనంగి, గిట్టంగి, పెదూరు, సన్యాసిరావు పేట, దేవుదళ, కొంచాడపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

● హరిపురం,జూన్ 26 (ఆంధ్రజ్యోతి): హరిపురం, మందస సబ్‌స్టేషన్ల పరిధిలో అంబుగాం, బొగాబంద ఫీడర్‌లో చెట్లు, కొమ్మలు తొలగించనుండడంతో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు సరఫరా నిలిపివేయ నున్నట్లు ఈఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు.

జాబ్‌చార్ట్ అమలుచేయాలి

● సమస్యల పరిష్కారంకోసం సచివాలయ ఉద్యోగుల నిరసనలు

నందిగాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు కల్పించాలని, జాబ్‌చార్ట్ అమలు చేయాలని గ్రామ సచివాలయాల ఉద్యోగులు కోరారు.ఈ మేరకు గురువారం నందిగాం తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్‌పట్నాయక్‌లకు అన్ని విభాగాల సచివాలయ ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. బదిలీల్లో సొంత మండలాల్లో పని చేసుకునేందుకు అవకాశం కల్పించడంతోపాటు పలు సమస్యల పరిష్కరించాలని వినతిపత్రాలను అందించారు.

● మందస,జూన్26(ఆంధ్రజ్యోతి):మందస మండల సచివాలయఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసనతెలిపారు.రేషనలేజైషన్, బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగాచేపట్టాలని ఎంపీడీవో వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.

● వజ్రపుకొత్తూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో రమేష్‌నాయుడు కు వినతిపత్రం అందించారు.



నందిగాం: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మునిసిపల్ కార్మికుల నిరసన

కాశీబుగ్గ, జూన్26(ఆంధ్రజ్యోతి):పనికి తగిన పనిముట్లు ఇవ్వాలని, పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమచేయాలని, చనిపోయిన, రిటైర్ అయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యిదర్శి గణపతి, మునిసిపల్ యూనియన్ వర్కర్స్ అధ్యక్ష కార్యదర్శులు వెంకట్,కూర్మారావు,మురుగన్ డిమాండ్ చేశారు. గురువారం కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని పాడైన పనిముట్లతో కార్మికులు నిరసన తెలిపారు.కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు ఈశ్వరరావు, బాలకృష్ణ, రమేష్, తిరుపతి, ముఖి, డిల్లీ,అమర్ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు